యోగాంధ్ర కోసం భారీ ఏర్పాట్లు

- విశాఖలో మోడీ పాల్గొనే కార్యక్రమానికి జిల్లా నుంచి 20 వేల మంది

- ట్రయిల్ రన్ విజయవంతం

విశాలాంధ్ర-శ్రీకాకుళం : అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విశాఖపట్నంలో ప్రధాని మోదీ హాజరయ్యే 'యోగాంధ్ర 2025' కార్యక్రమానికి శ్రీకాకుళం జిల్లా నుంచి 20 వేల మందిని తరలించేందుకు అధికారులు భారీ ఏర్పాట్లు చేపట్టారు. ఈ నేపథ్యంలో 430కి పైగా బస్సులు కేటాయించగా, బుధవారం ఆయా బస్సుల ఇన్చార్జులు, స్థానిక శాసనసభ్యులు, ఇతర ముఖ్య అధికార గణంతో కలసి జిల్లా కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ట్రయల్ రన్ నిర్వహించారు. బస్సులు విశాఖ సరిహద్దు బోయపాలెం చేరుకునే సమయంలో అక్కడి పోలీసు బలగాలు జిల్లా బృందాన్ని స్వాగతించనున్నాయి. బస్సుల్లో ప్రయాణించే ప్రతి బృందానికి బాధ్యత వహించే ఇన్‌చార్జులను కలెక్టర్ స్వయంగా ఎంపిక చేశారు. బస్సులు, పార్కింగ్ ప్రాంతాలు, వేదికల వరకూ రాకపోకల ఏర్పాట్లు, పాల్గొనేవారికి అందించే అల్పాహారం, టీ-షర్టులు, మ్యాట్లు, వాటర్ ప్యాకెట్లు, మరుగుదొడ్ల లొకేషన్లను కలెక్టర్ డా. స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆయా ప్రజా ప్రతినిధులతో కలిసి తుది పరిశీలన చేశారు. వేదికలో సీ-16 బ్లాక్ నుంచి మొత్తం 24 బ్లాక్‌లను భీమిలి బీచ్ రోడ్ లో శ్రీకాకుళం జిల్లాకు కేటాయించినట్లు సమాచారం. బస్సుల్లో అందించే అల్పాహారాన్ని ఏ ప్రాంతంలో పొందుపరచాలి, ప్రదేశాల వద్ద ఉన్న సహాయకుల సమన్వయం ఎలా ఉండాలి, ట్రాఫిక్, వైద్యం, తాగునీటి వంటి విభాగాల సమీకరణపై పూర్తిస్థాయిలో పునరాలోచనలు జరిగాయి. అనుభవజ్ఞులైన అధికారులు ప్రతి అంశాన్ని సూక్ష్మంగా సమీక్షిస్తూ యోగాంధ్రను విజయవంతం చేయాలన్న పట్టుదలతో పనిచేస్తున్నారని అధికార వర్గాలు తెలిపాయి. ఈ ట్రయల్ రన్‌కి విజయనగరం పార్లమెంట్ సభ్యులు కలిశెట్టి అప్పలనాయుడు, శాసనసభ్యులు గొండు శంకర్, నడుకుదుటి ఈశ్వరరావు, కూన రవికుమార్, బగ్గు రమణమూర్తి, జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, సుడా చైర్మన్ కొరికాన రవికుమార్ తదితరులు హాజరయ్యారు.

జడ్పీలో ముగ్గురికి కారుణ్య నియామకాలు

విశాలాంధ్ర-శ్రీకాకుళం టౌన్: ఉద్యోగంలో ఉండగా మరణించిన వారి సేవలను మరచిపోలేమని వారి కుటుంబాలను ఆదుకోవడం తమ బాధ్యతని జడ్పీ చైర్ పర్సన్ పిరియా విజయ అన్నారు. నూతనంగా ఉద్యోగం పొందిన వారు నిబద్ధతతో పని చేస్తూ, కార్యాలయానికి, జడ్పీకి మంచి పేరు తీసుకురావాలని ఆమె చెప్పారు. జిల్లా పరిషత్ యాజమాన్య పరిధిలో పనిచేస్తూ, పదవీ విరమణకు ముందే మరణించిన ముగ్గురు ఉద్యోగుల కుటుంబ సభ్యులకు సాంఘిక భద్రతా పథకం కింద ఉద్యోగ నియామక పత్రాలను బుధవారం మధ్యాహ్నం ఆమె జెడ్పీ బంగళాలో అందజేశారు. పదవీ విరమణకు ముందే ఉద్యోగంలో మరణించిన వారి కుటుంబాలకు అండగా నిలవాలనే ఉద్దేశంతో ఈ కారుణ్య నియామకాలను చేపట్టారు. వీరిలో రామనాథ్ పాణిగ్రాహి (గతంలో ఎస్ఏ, తెలుగు - జీహెచ్ఎస్ బారువ) కుమారుడు పాణిగ్రాహి సిద్ధేశ్వర్ ఎంపీపీ కంచిలిలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియమితులయ్యారు. అలాగే, ఆరిక (గతంలో ఓఎస్ - ఎంపీపీ భామిని) కుమార్తె బిడ్డిక మధుశ్రీ ఎంపీపీ సీతంపేటలో ఆఫీస్ సబార్డినేట్‌గా, వెంకటరమణ రావు (గతంలో జూనియర్ అసిస్టెంట్ - ఎంపీపీ బూర్జ) కుమార్తె ఇల్ల మేఘనా ఎంపీపీ గారలో ఆఫీస్ సబార్డినేట్‌గా నియామకం పొందారు. ఈ కార్యక్రమంలో జిల్లా ప్రజా పరిషత్ సీఈవో ఎల్.ఎన్.వి. శ్రీధర్ రాజా, డిప్యూటీ సీఈవో డి. సత్యనారాయణ, పరిపాలనాధికారి (సి-సెక్షన్) ఇతర సిబ్బంది పాల్గొన్నారు. జిల్లా పరిషత్ తీసుకున్న ఈ నిర్ణయం, ఉద్యోగంలో ఉండగా మరణించిన వారి కుటుంబాలకు అండగా నిలిచి, వారి సంక్షేమానికి ప్రాధాన్యత ఇచ్చినట్లయింది.

ప్రభుత్వ పాఠశాలలను బలోతం చేయాలి : పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష

విశాలాంధ్ర-పలాస: ప్రభుత్వ పాఠశాలలో ఎక్కువ మంది విద్యార్థులను చేర్చుకొని బలోపితం చేసే దిశగా ఉపాధ్యాయులు కషి చేయాలని పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష అన్నారు. గురువారం పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలోని కాశీబుగ్గ ఎంపిపి స్కూల్ ఈ ఏడాది నుంచి అప్ గ్రేడ్ అయ్యి హైస్కూల్ స్థాయిగా మారిన సందర్భంగా హైస్కూల్ మెదటి అడ్మిషన్లు ఆమె ప్రారంభించి, విద్యార్థిని, విద్యార్థులకు బట్టలు, పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలో ఉచిత విద్య, పిల్లలకు పుస్తకాలు, బట్టలు, మాష్, సన్నబియ్యంతో మధ్యాహ్న భోజనం అందించడంతో పాటు పిల్లల తల్లుల ఖాతాకు 13 వేల రూపాయలు ఆర్థిక సహాయం కింద అందించడం జరుగుతుందన్నారు. కార్పోరేట్ స్కూల్స్ మాయమాటలకు మోసపోయి ఆయా స్కూల్స్ చేర్పించి తల్లిదండ్రులు అప్పులు కావద్దని, నాణ్యమైన విద్య, ఆహారం ప్రభుత్వ పాఠశాలోనే దొరుకుతుందని దీనిని తల్లిదండ్రులు గుర్తించాలని, బడిబయట ఉన్న పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్చుకునే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని శిరీష సూచించారు.

ఆదరణ కిట్లు పంపిణీ : అర్హులైన లబ్దిదారులకు పలాస ఎమ్మెల్యే గౌతు శిరీష గురువారం మహిళా సమైఖ్య కేంద్రం వద్ద పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వం అర్హులైన బిసి కుటుంభాలకు ఆధరణ పథకం ద్వారా లబ్దిదారులకు ఉపయోగకరమైన వివిద రకాల వస్తువులు పంఫిణీ చేయడం జరుగుతుందని వీటిని ఆయా వత్తుల వారు వినియోగించుకొని ఆర్థికంగా అభివద్ధి చెందాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మన్ మల్లా శ్రీనివాస్, కౌన్సిలర్ దువ్వాడ శ్రీకాంత్, పలాస, వజ్రపుకొత్తూరు ఎంపిడిఓలు కె.వసంతకుమార్, ఎస్.రమేష్నాయుడు, పాఠశాల హెచ్ఎం, స్కూల కమిటీ చైర్మన్ ఉపాధ్యాయులు, విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు.

యోగా దినోత్సవానికి మీరు హాజరు కాకపోతే అంతే...!

- సిఎఫ్‌ల ద్వారా గ్రూప్ సభ్యులకు హెచ్చరికలు

విశాలాంధ్ర-టెక్కలి: ఈనెల 21వ తేదీన వైజాగ్ లో నిర్వహిస్తున్న యోగా దినోత్సవం కార్యక్రమానికి హాజరు కాకపోతే మీ పని ఇక అంతే ఉన్నతాధికారులు మీపై చర్యలు తీసుకుంటారని అంటూ ఫోన్లు ద్వారా హెచ్చరికలు వస్తున్నాయంట. వివరాల్లోకి వెళితే... మండలంలోని వివిధ గ్రామాలలో ఉన్న డ్వాక్రా మహిళలకు సిఎఫ్ లు ద్వారా ఫోన్లు చేయించి 40 సంవత్సరాలు లోపు ఉన్న మహిళలు తప్పనిసరిగా యోగా దినోత్సవం వైజాగ్ కార్యక్రమానికి హాజరు కావాలని లేకుంటే మీకు రావాల్సిన ప్రభుత్వ పథకాలు పరిస్థితి ఇక అంతేనని హెచ్చరికలు జారీ చేస్తున్నారని డ్వాక్రా మహిళలు అంటున్నారు. వైజాగ్ వెళ్లకపోతే ఏం జరుగుతుందో అని తెలియక అయోమయం లో పడ్డారు డ్వాక్రా మహిళలు. ప్రభుత్వం తన పార్టీ గొప్ప కోసం జనాభా సంఖ్య కోసం డ్వాక్రా మహిళలపై ఇలా హెచ్చరికలు జారీ చేయడం సరికాదని వాపోతున్నారు. సంక్షేమ పథకాల కోసం మహిళలపై ఒత్తిడి చేయడం సరికాదని అంటున్నారు.

పేదరికం లేని గిరిజన సమాజమే ప్రభుత్వ ధ్యేయం : ఐటీడీఏ ఏపీఎం

విశాలాంధ్ర-మందస: కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వ పథకాలను సక్రమంగా వినియోగించుకొని పేదరికం లేని గిరిజన సమాజమే ప్రభుత్వ ధ్యేయం అని వెలుగు ఐటీడీఏ అసిస్టెంట్ ప్రాజెక్ట్ మేనేజర్ పైడి కూర్మారావు తెలిపారు. గురువారం చీపి పంచాయతీలో సర్పంచ్ సవర లక్ష్మిప్రియ అధ్యక్షతన డిప్యూటీ ఎం.పీ.డీ.వో. వరప్రసాద్ ఆధ్వర్యంలో జరిగిన జన జాతీయ గౌరవ వర్ష్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దర్తీ అబ జన్ భగీదరి అభియాన్ ద్వారా గిరిజన గ్రామాలలో అన్ని రకాల మౌలిక వసతులను కల్పించేందుకే సర్వే జరిపించినట్లు వివరించారు. గిరిజన గ్రామాలలో ప్రతీ కుటుంబం కూడా ఆరోగ్యంతో పాటు ఆనందంగా జీవించడానికి రక్షిత మంచి నీరు,విద్య, వైద్యం, న్యూట్రిషన్ ఫుడ్, శానిటేషన్ తదితర అన్ని రకాల అవసరాలపై అందరికీ అవగాహన ఉండాలని వివరించారు. ఉపాధి, ఆదాయాభివృద్ధి కార్యక్రమాలు మెరుగు పరుచుకోవడానికి స్వయం శక్తి సంఘాలలో పంచ సూత్రాలు పాటిస్తున్న సభ్యులందరికీ అవసరమైన పరపతి సౌకర్యాన్ని ఉన్నతి,శ్రీనిధి ,తదితర బ్యాంకుల ద్వారా ప్రభుత్వం కల్పిస్తున్నట్లు వివరించారు. మండల వ్యవసాయ అధికారి నాగరాజు మాట్లాడుతూ ప్రకృతి వ్యవసాయంతో పాటు రైతులు వాణిజ్య పంటలకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఉపాధి హామీ పథకం ఏ.పీ.వో. హరికృష్ణ మాట్లాడుతూ జాబు కార్డు ఉన్న వారందరికీ ఉపాధి అవకాశాలతో పాటు పండ్ల మొక్కల పెంపకానికి, కంపోస్ట్ పిట్స్ ఏర్పాటుకు ఎక్కువ ప్రాధాన్యత ఇవ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో వెలుగు, ఉపాధి హామీ, ఐ.సి.డి.ఎస్., ఆశ,ఆరోగ్య కార్యకర్తలు మండల స్థాయి సిబ్బందితో పాటు సచివాలయ సిబ్బంది మహిళా సంఘాల ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

జెడ్పీటీసీ పరామర్శ

విశాలాంధ్ర-సోంపేట : సోంపేటకు చెందిన డీలర్ పూనా మోహన్‌రావు ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందారు. ఈ విషయం తెలుసుకున్న సోంపేట జడ్పిటిసి తడక యశోద మరియు పలాసపురం సర్పంచ్ తడక జోగారావులు వారి కుటుంబ సభ్యులకు పరామర్శించి ఆయన చిత్రపటానికి నివాళులు అర్పించి, ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు.

పాఠశాలలో యోగ అభ్యశనంగా ఎందుకు చేర్చారాదు..?

విశాలాంధ్ర - సరుబుజ్జిలి : 11వ అంతర్జాతీయ యోగ దినోత్సవం పురస్కరించుకొని నేడు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యోగాంధ్ర పేరుతో, అధికారులతో సమన్వయం చేసి విశాఖపట్నం తండోప తండాలుగా ప్రజలను తరలిస్తున్నారు. ఇది మంచి విషయమే అయితే విజన్ అంటే ప్రపంచంలోనే ముఖ్యమంత్రి చంద్రబాబు పేరు వినపడుతుంది. అలాంటి వ్యక్తి ఇప్పటి నుండయన ప్రాథమిక తరగతుల నుండి ఒక అబ్యసనంగా ఎందుకు మార్చరాదు....? మునుపు పాఠశాలలలో ప్రతి రోజు సాయంత్రం డ్రిల్ నిర్వహించేవారు, కానీ...? కార్పొరేట్ రంగం పూర్తి శాతం విద్యలో ఇన్వాల్వ్ అయ్యాక ర్యాంక్ లు, స్కోర్ మీద మాత్రమే శ్రద్ధ వహించి, పిల్లల ఆరోగ్యం పై అశ్రద్ధ చేస్తున్నారన్నది వాస్తవం. ఇప్పటికైనా ప్రభుత్వం రేపటి ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ నిర్మాణంలో భాగంగా యోగ తరగతి గదిలో ఒక అభ్యసనంగా మార్చటం వలనే సాధ్యమవుతుంది.

-తారకేశ్వరరావు కూటికుప్పల

21న యోగాను జయప్రదం చేయండి

- ఎమ్మెల్యే మామిడి గోవిందరావు

విశాలాంధ్ర -హిరమండలం/పాతపట్నం: పాతపట్నం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన యోగాంధ్ర కార్యక్రమంలో శాసనసభ్యులు మామిడి గోవింద రావు గురువారం పాల్గొన్నారు ప్రజారోగ్యమే ప్రథమ లక్ష్యంగా ప్రధానమంత్రి నరేంద్ర మోది, రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు చంద్రబాబునాయుడు చేపట్టిన యోగాంధ్ర కార్యక్రమం రాష్ట్రవ్యాప్తంగా కొనసాగుతుందని పాతపట్నం నియోజకవర్గం లోని ఐదు మండలాల నాయకులు 21వ తేదీన విశాఖపట్నంలో జరుగునున్న యోగ దినోత్సవం లో ప్రతి ఒక్కరూ పాల్గొని విజయవంతం చేయాలని గురువారం ఎమ్మెల్యే కోరారు.యోగ తోనే ప్రతీ ఒక్కరూ ఆరోగ్యం గా జీవించడం సాధ్యమని ఎమ్మెల్యే కొనియాడారు.

డిగ్రీ కళాశాలలో 23న జాబ్ మేళా

విశాలాంధ్ర-టెక్కలి : జెకెసి మరియు కెరియర్ రిక్రూట్మెంట్ సొల్యూషన్ ఆధ్వర్యంలో జూన్ 23న ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో జాబ్ మేళా నిర్వహించనున్నట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ టి. గోవిందమ్మ ఒక ప్రకటనలో తెలిపారు. హెచ్ఎఫ్ఎల్, టిసిఎల్, కేఐఏ, హ్యుందాయ్, నెక్సిన్, యాక్సిస్ బ్యాంక్, ఎంఐవిఐ, ప్రీమియర్ ఎనర్జీస్, ఫ్లిప్కార్ట్, దివిస్ ల్యాబ్స్, మెడికేర్, అపోలో ఫార్మసీ, ఎం వి ఎన్, రెడ్డీస్ ల్యాబ్, యావరేజ్ సైన్స్ అండ్ టెక్నాలజీ మొదలైన కంపెనీ ప్రతినిధులు హాజరై 10వ తరగతి, ఇంటర్, డిగ్రీ, బీటెక్ తదితర అర్హతల ను బట్టి నిరుద్యోగ యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పించడం జరుగుతుందని తెలియజేశారు.

ముమ్మరంగా జనసేన సభ్యత్వాలు

విశాలాంధ్ర-కవిటి : జనసేన పార్టీ సభ్యత్వాలు మండలంలో ముమ్మరంగా సాగుతున్నాయి. ఇచ్ఛాపురం జనసేన ఇన్చార్జి దాసరి రాజు ఆదేశాలు మేరకు పలు గ్రామాల్లో సభ్యత్వాలు నమోదు చేస్తున్నారు. డిజి. పుట్టుగ పంచాయతీలో జనసేన పంచాయతీ ఇన్చార్జి బి.కృష్ణారావు ఆధ్వర్యంలో యువకులు సభ్యత్వాలు తీసుకున్నారు. సభ్యత్వ తీసుకున్న ప్రతీ కార్యకర్తకు రాష్ట్ర అధ్యక్షులు పవన్ కళ్యాణ్ ప్రమాద భీమా అమలు చేస్తారని పార్టీ వర్గాలు తెలిపాయి. ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు, వీర మహిళలు పాల్గొన్నారు.

తల్లికు వందనం అమ్మలకు వరం

విశాలాంధ్ర-కవిటి : కూటమి ప్రభుత్వం అందిస్తున్న తల్లికి వందనం పథకం నిరుపేదలకు వరంగా మారిందని ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. ఈ మేరకు గురువారం రామయ్య పుట్టుగలోని తన క్యాంపు కార్యాలయంలో కంచిలి మండలం బూరగాం ఉన్నత పాఠశాలలో చదువుతన్న ఒకే కుటుంబాని చెందిన నెయ్యిల జ్యోతిప్రకాష్, చరణ్‌కు తల్లికి వందనం పథకం ద్వారా బ్యాంకులు రూ.26 వేలు అందడంతో కృతజ్ఞతలు తెలపడానికి వచ్చిన వారికి ఎమ్మెల్యే అశోక్ అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తల్లికి వందనంపై ప్రతిపక్షాలు అనవసర దుమారం చేస్తున్నారని దమ్ముంటే ఆధారాలతో నిరూపించాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు సోమేశ్వరరావు, నిరంజన్, కాంతారావు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

యోగాంధ్ర ఏర్పాట్లలో లోటుపాట్లు లేకుండా చూడండి

రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ సురేష్ కుమార్

విశాలాంధ్ర-విశాఖపట్నం : విశాఖ వేదికగా యోగాంధ్ర కార్యక్రమాల్లో భాగంగా జూన్ 21న విశాఖ బీచ్ ప్రాంతాల్లో నిర్వహించనున్న 11వ అంతర్జాతీయ దినోత్సవం కార్యక్రమం ఏర్పాట్లలో ప్రజలకు, యోగా ఔత్సాహికులకు వసతులు, మౌలిక సదుపాయాల కల్పనలో ఎటువంటి లోటుపాట్లు లేకుండా పటిష్టమైన చర్యలు చేపట్టాలని రాష్ట్ర మున్సిపల్ శాఖ ప్రిన్సిపల్ సెక్రెటరీ ఎస్.సురేష్ కుమార్ జీవీఎంసీ అధికారులను ఆదేశించారు. గురువారం ఆయన కమిషనర్ అండ్ డైరెక్టర్ ఆఫ్ మున్సిపల్ అడ్మినిస్ట్రేషన్ డాక్టర్ పి. సంపత్ కుమార్, జీవీఎంసీ కమిషనర్ కేతన్ గార్గ్, ఇతర జీవీఎంసీ అధికారులతో కలిసి ఆర్కే బీచ్ కాళీమాత గుడి వద్ద యోగా ప్రధాన వేదిక, పార్కు హోటల్, తేనేటి పార్కు, సీతకొండ, ఏ వన్ గ్రాండ్, తిమ్మాపురం తదితర పరిసర ప్రాంతాల్లో యోగాంధ్ర కార్యక్రమం ఏర్పాటులను, త్రాగునీరు, పబ్లిక్ టాయిలెట్లు,పారిశుధ్య పనులు, లైటింగ్ నిర్వహణను పరిశీలించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మున్సిపల్ ప్రిన్సిపల్ సెక్రెటరీ మాట్లాడుతూ నగరంలో నిర్వహించే అంతర్జాతీయ యోగ దినోత్సవ కార్యక్రమాలలో ప్రజలకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా పారిశుధ్య పనులు నిర్వహించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. యోగా కార్యక్రమానికి లక్షలాదిమంది ప్రజలు వస్తున్నందున నగరంలో పలుచోట్ల తాత్కాలికంగా నిర్మిస్తున్న మరుగుదొడ్లను పరిశీలించి పనులు ఎంతవరకు పూర్తయ్యాయో అని జీవీఎంసీ ఇంజనీరింగ్ అధికారులను ఆరా తీశారు. మరుగుదొడ్లలో నిరంతరం సమృద్ధిగా నీరు ఉండే విధంగా చూడాలని ఆదేశించారు. యోగ కంపార్ట్మెంట్లల వద్ద తాగునీరు, మరుగుదొడ్లు ఏర్పాటు చేసి వాటిలో నిరంతరం నీరు ఉండేలా చర్యలు చేపట్టాలని ఆదేశించారు. ప్రజలందరూ ఆయా పాయింట్లకు వద్దకు రాత్రి వస్తున్నందున లైటింగ్, మరుగుదొడ్లు, తాగునీరు పారిశుధ్యంలో ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను ఆదేశించారు ప్రతి ప్రాంతంలో అధిక సంఖ్యలో పారిశుధ్య కార్మికులను, అధికంగా అవసరమాకు మరుగుదొడ్లను ఏర్పాటు చేసి నిత్యం పారిశుధ్యం పై దృష్టి సారించి ఎప్పటికప్పుడు వ్యర్థాల లేకుండా రోడ్లను, పరిసరాలను పరిశుభ్రపరచాలని అధికారులను ఆదేశించారు. విశాఖ ఖ్యాతి దిశగా యోగా ఆంధ్ర కార్యక్రమాల్లో భాగంగా 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని జయప్రదం చేసేందుకు అవసరమగో కార్యక్రమాలను జీవీఎంసీ తరవున ఏర్పాటు చేయాలని అధికారులకు ఆయన ఆదేశించారు. ఈ పర్యటనలో జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్, పర్యవేక్షక ఇంజనీరులు కృష్ణారావు, కె.వి.ఎన్. రవి తదితరులు పాల్గొన్నారు.

ఆంధ్రా యూనివర్సిటీ ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగానికి బ్రెస్ట్ క్యాన్సర్ ఔషధంపై పేటెంట్

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్రా యూనివర్సిటీకి చెందిన ఇంజినీరింగ్ కెమిస్ట్రీ విభాగం ప్రొఫెసర్ బి. కిషోర్ బాబు, వారి పరిశోధనా బృందం (అప్పారావు, స్వర్ణలత, వీర్రాజు, గోపి, ఫణి) ఒక గొప్ప విజయం సాధించారు. బ్రెస్ట్ క్యాన్సర్ చికిత్సకు అభివృద్ధి చేసిన నూతన నాఫ్థాలిమైడ్ డెరివేటివ్ సమ్మేళనానికి భారత ప్రభుత్వ పేటెంట్ కార్యాలయం 20 సంవత్సరాల కాలానికి పేటెంట్ మంజూరు చేసింది. ఈ సమ్మేళనం నిర్దిష్టమైన బ్రెస్ట్ క్యాన్సర్ కణాలపై మెరుగైన ప్రభావాన్ని చూపడం, తక్కువ దుష్ప్రభావాలు కలిగి ఉండటం, మరియు డ్రగ్-రెసిస్టెంట్ కణాలను లక్ష్యంగా చేసుకునే ప్రత్యేకమైన పని విధానాన్ని కలిగి ఉండటం వంటి అనేక ప్రయోజనాలను కలిగి ఉంది. ఈ సందర్భంగా వైస్ చాన్స్‌లర్ ప్రొఫెసర్ జి.పి. రాజశేఖర్, రిజిస్ట్రార్ ప్రొఫెసర్ ఈ.ఎన్. ధనుంజయ రావు, రెక్టార్ ప్రొఫెసర్ కిషోర్ బాబులు బృందాన్ని అభినందించారు. ఈ ప్రయోగాత్మక విజయం యూనివర్సిటీకి అంతర్జాతీయ స్థాయిలో గౌరవాన్ని తీసుకురానుందని వారు అన్నారు.

దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-మల్కాపురం : దళిత హక్కుల పోరాట సమితి విశాఖ జిల్లా మహాసభలను జయప్రదం చేయాలని గురువారం మల్కాపురం గ్రామ మండలిలో ఎస్ రాజు అధ్యక్షతతో సమావేశాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి దళిత హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ప్రభాకర్ పాల్గొని మాట్లాడుతూ దళితుల రక్షణ కోసం ఎస్సీ ఎస్టీ అట్రాసిటీ చట్టాన్ని రక్షించుకుందాం, కుల నిర్మూలన, సామాజిక న్యాయం, దళితుల ఐక్యత, మానవీయ హక్కుల సాధనే లక్ష్యాలుగా ప్రారంభించిన సంఘం దళిత హక్కుల పోరాట సమితి. విశాఖ జిల్లాలో సంఘం లక్ష్యాలకు అణుగునంగా ఎన్నో పోరాటాలు చేసింది. ప్రైవేట్ రంగాల్లో రిజర్వేషన్లు అమలు చేయాలని ప్రతి దళిత కుటుంబానికి మూడు ఎకరాల సహజమైన భూమి ఇవ్వాలని అనేక పోరాటాలు సదస్సులో చేయడం జరిగింది సమావేశంలో పాల్గొన్నా దళిత నాయకులు డిహెచ్పిఎస్ విశాఖ జిల్లా కార్యదర్శి గుడాల రాంబాబు మరియు టీ కామేశ్వరరావు మరియు డి గణపతి మరియు శ్రీనివాస్ మరియు కే శంకర్రావు మరియు బి వెంకట్ కనకరాజు రమేష్ తదితరులు పాల్గొన్నారు.

యోగాంధ్ర కార్యక్రమం ప్రతి ఒక్కరికీ ప్రతిష్టాత్మకం : మంత్రి కందుల దుర్గేష్

విశాలాంధ్ర-పెందుర్తి : జూన్ 21న విశాఖలో నిర్వహిస్తున్న 11 వ అంతర్జాతీయ యోగా దినోత్సవం రాష్ట్రంలోని ప్రతి ఒక్కరికి ప్రతిష్టాత్మకమని పర్యాటక శాఖ మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. పెందుర్తి ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు ఆధ్వర్యంలో జీవీఎంసీ జోన్ 8,పెందుర్తి మండలం ఉన్నతాధికారులతో నిర్వహించిన సమీక్ష కార్యక్రమంలో మంత్రి ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ గుజరాత్‌లో 1.4లక్షల మందితో నిర్వహించిన యోగా కార్యక్రమానికి మించి 3.5 లక్షల మందితో ఏకకాలంలో యోగాసనాలు వేయడాన్ని ప్రధాని నరేంద్ర మోడీ ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారని ఈ కార్యక్రమంలో మనందరం భాగస్వాములు కావడం అదృష్టం అని మంత్రితో పాటు ఎమ్మెల్యే రమేష్‌బాబు అధికారులు, ఎన్డీఏ నాయకులకు పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జోన్ 8 జోనల్ కమిషనర్ హైమావతి, పెందుర్తి ఎంపీడీవో అప్పలరాజు, ఏపీఎం ఎస్తేరు రాణి, ఏపీడిఓ చిరంజీవి, భారతీయ జనతా పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గొర్లె రామునాయుడు, 94 వ వార్డు కార్పొరేటర్ బల్లా శ్రీనివాసరావు, 97వ వార్డ్ తెలుగుదేశం సీనియర్ నాయకులు సేనాపతి శంకర్రావు, మండల పార్టీ అధ్యక్షులు కొరుపోలు రామనాయుడు, కరక దేవుడు, వార్డు అధ్యక్షులు సేనాపతి సోమశేఖర్, కంచిపాటి మధు, దాట్ల మధు,మజ్జి సూరిబాబు, పిన్నింటి పార్వతి, ఆదిబాబు, అయితి సింహాచలం నాయుడు, గొర్లె అప్పారావు, ఆర్ఎస్ నాయుడు, గొరపల్లి సత్యారావు, ఎంపీటీసీ గొల్లవిల్లి రమణ, సర్పంచ్‌లు మడక అప్పలరాజు, దూది వెంకటరమణ, బయలుపూడి హరి గోపాల్, రాపర్తి కృష్ణమోహన్, రాపర్తి కిషోర్, సదరం భీమేశ్వరరావు, నీటిపల్లి మహేష్, పత్రి శివ, మరక బంగారురాజు, ఆళ్ల తాతారావు, ఎంపీపీ కాళ్ల వరలక్ష్మి, ఎన్డిఏ మహాకూటమి నాయకులు, కార్యకర్తలు వీర మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విశాఖలో నేడు, రేపు పాఠశాలలకు సెలవు

డిఈఓ ప్రేమ్‌కుమార్

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : 11వ అంతర్జాతీయ యోగా దీనోత్సవం సందర్భంగా ఈనెల 20, 21 శుక్రవారం, శనివారం పాఠశాలకు విశాఖ డిఈఓ ప్రేమ్‌కుమార్ సెలవు ప్రకటించారు. విశాఖకు యోగాంధ్ర ప్రపంచ రికార్డు దిశగా తీసుకెళ్లాలని ప్రభుత్వం భావిస్తుంది. ఈ సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కేంద్రం నుంచి, రాష్ట్రం నుంచి ప్రముఖుల రాకతో విశాఖ రోడ్లన్నీ కిటకిటలాడుతున్న సందర్భంగా పాఠశాలకు సెలవు ప్రకటించామని డిఇఓ తెలిపారు. కొన్ని పాఠశాలల్లో కాలేజీల్లో విద్యార్థులు యోగ కార్యక్రమానికి హాజరవుతున్నారు. విద్యా సంస్థల్లో పెద్దఎత్తున విద్యార్థుల సమీకరణతో ఏర్పాట్లు చేసింది.

జనసేన, టిడిపి నాయకులు ప్రోటోకాల్ పాటించకపోవడం విచారకరం

బిజెపి వార్డు అధ్యక్షుడు చిక్కాల సతీష్

విశాలాంధ్ర-పెందుర్తి : జనసేన, టీడీపీ నాయకులు ప్రోటోకాల్ పాటించకుండా శంకుస్థాపన చేయడం మంచి సాంప్రదాయం కాదని జీవీఎంసీ 95 97 వార్డుల బిజెపి అధ్యక్షుడు చిక్కాల సతీష్ ఆవేదన వ్యక్తం చేశారు. గ్రేటర్ విశాఖ మున్సిపల్ కార్పొరేషన్ నిధులుతో చేపట్టనున్న 95వ వార్డు పరిధిలోగల శివగాయత్రినగర్ రోడ్డు నిర్మాణానికి నగర మేయర్ పిలా శ్రీనివాసరావు, స్థానిక ఎమ్మెల్యే పంచకర్ల రమేష్ బాబు, స్థానిక కార్పొరేటర్ ముమ్మన దేముడుకు సమాచారం ఇవ్వకుండా కేవలం జనసేన, టిడిపి నాయకులు రోడ్డు నిర్మాణ పనులకు ఎలా శంకుస్థాపన చేసారని ఓ ప్రకటనలో ఆయన ప్రశ్నించారు. అభివృద్ధి కార్యక్రమాలకు శంకుస్థాపన చేసేటప్పుడు గౌరవ మేయర్, ఎమ్మెల్యే , సంబంధిత వార్డు కార్పొరేటర్ దృష్టికి తీసుకు వెళ్లడం ప్రోటోకాల్ పద్ధతి అని, కార్యక్రమానికి ఆహ్వానించడం గౌరవ ప్రదమని సతీష్ పేర్కొన్నారు. ఇది కేవలం పార్టీ కార్యక్రమం లాగా జనసేన, తెలుగుదేశం పార్టీ నాయకులు బుధవారం శివగాయత్రి నగర్‌లో శంకుస్థాపన చేయడం సరికాదని హితవు పలికారు. భవిష్యత్తులో ఇటువంటి కార్యక్రమాలు పునరావత్తం కాకుండా చూడాలని ఆయన కోరారు. ఈ శంకుస్థాపన విషయాన్ని ఎన్డీఏ కూటమి పెద్దల దృష్టికి తీసుకెళ్తామని సతీష్ తెలియజేశారు.

శ్రీ చైతన్య, నారాయణ ఫీజుల దోపిడీని అరికట్టాలి

- పుస్తకాల విక్రయం తగదు - విజయవాడలో పోలీసుల అత్యుత్సాహం

- ఏ.ఐ ఎస్.ఎఫ్. జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు

విశాలాంధ్ర-విశాఖ : ఆశీలమెట్ట శ్రీ చైతన్య సాయి సుధా క్యాంపస్ వద్ద గురువారం ఏ.ఐ.ఎస్.ఎఫ్ ఆధ్వర్యంలో ఆందోళన జరిగింది. విజయవాడ బందర్ రోడ్డు సమీపంలోని శ్రీ చైతన్య ఇందిరా భవన్ క్యాంపస్ లో బుక్స్, యూనిఫామ్, బ్యాగ్, షూస్ లను ఎమ్మార్పీ ధర లేకుండా విద్యా హక్కు చట్టానికి విరుద్ధంగా కళాశాల పేరుతో ముద్రించి తల్లిదండ్రులకు విక్రయించడం పై ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన ఆందోళన జరిగింది. ఈ ఆందోళనలో పాల్గొన్న వారిపై పోలీసులు అక్రమ కేసులు బనాయించడానికి వ్యతిరేకిస్తూ ఈ ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి ఉల్లం నాగరాజు మాట్లాడుతూ విజయవాడలో ఏఐఎస్ఎఫ్ నాయకులపై పోలీసులు అత్యుత్సాహం ప్రదర్శించడానికి ఖండించాలి. వేల రూపాయలు వసూలు చేస్తున్న కళాశాలపై చర్యలు తీసుకోవాలని స్థానిక ఆర్.ఐ.ఓ కి ఏ.ఐ.ఎస్.ఎఫ్. నాయకులు ఫిర్యాదు చేశారని చెప్పారు. ఆర్ ఐ ఓ కళాశాలకు చేరుకునే సమయంలో అక్కడ ఉన్న మాచవరం పోలీసులు ఆర్ ఐ ఓ వచ్చే లోపు క్యాంపస్ ఖాళీ చేసి వెళ్లాలని ఫీజులు దోపిడీకి మద్దతు పలుకుతూ ఏ.ఐ.ఎస్.ఎఫ్. నాయకులను బూటు కాళ్లతో తన్ని బయటకు నెట్టేసారని తెలిపారు. విద్యార్థి సంఘం నాయకులు ఎంత చెప్పినా వినిపించుకోకుండా స్టేషన్ కు తరలించి అక్రమ కేసులు బనాయించారన్నారు. ఈ వైఖరిని ఏ.ఐ.ఎస్.ఎఫ్. విశాఖ జిల్లా సమితి తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఫీజుల దోపిడీని అరికట్టవలసిన ప్రభుత్వం కార్పొరేట్ శ్రీ చైతన్య విద్యా సంస్థలకు కొమ్ము కాయడం దారుణమని విమర్శించారు. విద్యాశాఖా మంత్రి లోకేష్ బాధ్యత తీసుకున్నది విద్యార్థుల పక్షాన ఉన్న ఏ.ఐ.ఎస్.ఎఫ్. నాయకులపై కేసులు పెట్టించే శ్రీ చైతన్య, నారాయణ వంటి కార్పొరేట్ విద్యా సంస్థలకు కొమ్ము కాయడానికా? అని ప్రశ్నించారు. గతంలో తెలుగుదేశం పార్టీ విద్యార్థి సంఘం ఏఐఎస్ఎఫ్‌తో కలిసి ఉమ్మడి కార్యక్రమాలు నిర్వహించిన రోజులు గుర్తు లేవా అని ప్రశ్నించారు. పోలీసుల చర్యలను మంత్రి లోకేష్, హోంమంత్రి అనిత ఖండించి ఫీజులు దోపిడీ చేస్తున్న శ్రీ చైతన్య విద్యా సంస్థలపై చర్యలు తీసుకొని విద్యార్థుల పక్షాన్న నిలబడాలన్నారు. ఎన్ని అక్రమ కేసులు పెట్టినా ఫీజుల దోపిడీకి వ్యతిరేకంగా ఏ.ఐ.ఎస్.ఎఫ్. నాయకత్వం విద్యార్థుల పక్షాన పోరాడుతుందని తెలిపారు. రాబోయే రోజుల్లో రాష్ట్ర వ్యాప్త ఆందోళనకు శ్రీకారం చుడతామని హెచ్చరించారు. తక్షణమే ఫీజుల దోపిడీ చేస్తున్న శ్రీ చైతన్య, నారాయణ, ఇతర ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా అధ్యక్షులు పి శేఖర్, సహాయ కార్యదర్శులు మౌనిక, హేమానంద్, సమితి సభ్యులు అభి, గణేష్, సూర్య, మధు, అశోక్, వినయ్, ఆకాష్, తదితర విద్యార్థులు పాల్గొన్నారు.

తర్లువాడ హైస్కూల్ విద్యార్థులు యోగాంధ్ర లోగో ప్రదర్శన

విశాలాంధ్ర-అనందపురం : మండలంలోని తర్లువాడ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో యోగ ఆంధ్ర లోగో విద్యార్థులు ప్రదర్శించారు జూన్ 21న జాతీయ మరియు అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకొని విద్యార్థులు యోగాసనాలతో భాగంగా యోగాంధ్ర లోగో ప్రదర్శించారు. ఈ కార్యక్రమాన్ని శారీరక ఉపాధ్యాయులు (పిడి) పొన్నాడ మాధవరావు ఆధ్వర్యంలో ప్రధానోపాధ్యాయురాలు పి. జ్యోతి మార్గదర్శనంలో ఎంతో ఉత్తేజంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సుమారు 150 మంది విద్యార్థులు పెద్ద ఎత్తున పాల్గొని వివిధ యోగా ఆసనాలు ప్రదర్శించారు. యోగా ప్రాముఖ్యతను వివరించే బోధన సెషన్లు కూడా నిర్వహించబడ్డాయి. "యోగాతో ఆరోగ్యాన్ని పెంపొందించుకోవడం, శాంతియుత మనస్సు స్థితిని కలిగి ఉండటం, జీవితంలో నెగెటివ్ ఆలోచనలను తగ్గించడం సులభం అవుతుంది" అని మాధవరావు అన్నారు. జ్యోతి మాట్లాడుతూ, "యోగా అనేది భారత సంస్కృతి యొక్క మహత్తరమైన భాగం. ప్రతి విద్యార్థి రోజూ కనీసం కొన్ని నిమిషాలు యోగా అలవాటు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు, తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

చోడవరం ఎన్నికల పరిశీలకుడిగా వేగి పరమేశ్వరరావు

విశాలాంధ్ర-పెందుర్తి : చోడవరం నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ పరిశీలకుడిగా రాష్ట్ర గవర కార్పొరేషన్ డైరెక్టర్, పెందుర్తి గౌరీ సేవా సంఘం అధ్యక్షుడు వేగి పరమేశ్వర రావు నియమితులయ్యారు. త్వరలో జరగనున్న స్థానిక సంస్థల ఎన్నికల కోసం టీడీపీ శ్రేణులను సమయత్తం చేయడం కోసం పార్టీ సీనియర్ నాయకులను పరిశీలకులుగా టిడిపి జాతీయ అధ్యక్షుడు, ముఖ్యమంత్రి చంద్రబాబు నియమించారు. ఈ క్రమంలో వేగి పరమేశ్వరరావును చోడవరం నియోజకవర్గ పరిశీలకుడిగా నియమించడంతో చంద్రబాబుకు ఆయన కృతజ్ఞతలు తెలియజేశారు.

స్వచ్ఛందంగా భాగస్వామ్యమవుదాం

- విశాఖ వేదికగా సరికొత్త రికార్డు సృష్టిద్దాం...
- ప్రజలకు పిలుపునిచ్చిన రాష్ట్ర మంత్రులు బాలవీరాంజనేయ స్వామి, సత్యకుమార్ యాదవ్, సవిత

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు ఆకాంక్ష మేరకు ఈ నెల 21న విశాఖ వేదికగా నిర్వహించే అంతర్జాతీయ యోగా దినోత్సవ వేడుకలో ప్రజలంతా స్వచ్ఛందంగా భాగస్వామ్యం కావాలని, సాగరతీరంలో సరికొత్త రికార్డు సృష్టించేందుకు సహకరించాలని రాష్ట్ర మంత్రులు డోలా శ్రీబాల వీరాంజనేయ స్వామి, సత్యకుమార్ యాదవ్, సవిత పిలుపునిచ్చారు. ఆయుష్ శాఖ, జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో గురువారం ఉదయం ఏయూ కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు నిర్వహించిన వాక్ థాన్ ర్యాలీలో మంత్రులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రజలను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించతలపెట్టిన కార్యక్రమాన్ని విజయవంతం చేయాల్సిన బాధ్యత అందరిపైనా ఉందని పేర్కొన్నారు. 2 కోట్ల మందికి రిజిస్ట్రేషన్ చేయించాలని లక్ష్యంగా అతి కొద్దికాలంలోనే లక్ష్యాన్ని చేరుకున్నామని, యోగా ప్రజలకు అతి చేరువైందని చెప్పడానికి ఇదే నిదర్శనమన్నారు. యోగా ద్వారా శారీరక, మానసిక ఆరోగ్యం బాగుంటుందని, ప్రతి రోజూ ఒక గంట యోగా చేయాలని సత్యకుమార్ యాదవ్ సూచించారు.

ఆయుష్ సెక్రటరీ రాజేశ్ కొట్చా మాట్లాడుతూ యోగా వేడుకల్లో ప్రజలంతా ఉత్సాహంగా పాల్గొనాలని పిలుపునిచ్చారు. స్పెషల్ సీఎస్ ఎం.టి. కృష్ణబాబు మాట్లాడుతూ ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తున్న కార్యక్రమంలో అందరూ స్వచ్ఛందంగా భాగస్వాములు కావాలని, సరికొత్త విజయం ద్వారా ప్రపంచానికి మంచి సందేశం ఇవ్వాలని సూచించారు. యోగాను ప్రజల జీవన విధానంలో భాగస్వామ్యం చేసేందుకు వివిధ కార్యక్రమాలను నిర్వహించామని చెప్పారు. మూడు దశల్లో యోగాపై పోటీలు నిర్వహించామని, 25 లక్షల మందికి సర్టిఫికెట్లు జారీ చేశామన్నారు. రాష్ట్ర స్థాయిలో నిర్వహించిన పోటీల్లో 126 మంది విజేతలుగా నిలిచారని, వారంతా ప్రధాని, ముఖ్యమంత్రితో పాటు ప్రధాన వేదికలో యోగాసనాలు వేస్తారని పేర్కొన్నారు. యోగాను ప్రజలకు చేరువ చేసేందుకు వివిధ కార్యక్రమాలు నిర్వహించినట్లు వివరించారు.

ఉత్సాహంగా సాగిన వాక్ థాన్... యోగా వేడుకల సన్నాహాలు, విస్తృత ప్రచారంలో భాగంగా ఆయుష్ శాఖ, యంత్రాంగం ఆధ్వర్యంలో నిర్వహించిన వాక్ థాన్ ఉత్సాహంగా సాగింది. ఏయూ కన్వెన్షన్ హాలు నుంచి విశ్వప్రియ ఫంక్షన్ హాలు వరకు సాగిన వాక్ థాన్ లో మంత్రులు, రాష్ట్ర, జిల్లా స్థాయి అధికారులు, యోగా అసోసియేషన్ ప్రతినిధులు, విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. అనంతరం వారంతా విశ్వప్రియ ఫంక్షన్ హాలు ముందు భాగంలో ఉన్న యోగాంధ్ర వేదికలో యోగాసనాలు వేశారు. కార్యక్రమంలో భాగంగా మంత్రులు, అధికారుల చేతుల మీదుగా యోగా అభ్యసకులకు టీషర్టులు పంపిణీ చేశారు. ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే వేపాడ చిరంజీవిరావు, మేయర్ పీలా శ్రీనివాస్, సీనియర్ ఐఏఎస్ అధికారులు సురేష్ కుమార్, వీరపాండ్యన్, విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు, ప్రజా ప్రతినిధులు నరసింహ రెడ్డి, పరశు రామ్ రాజు, మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

21 నుండి అమెజాన్ డాట్ ఇన్‌పై సంగీత పరికరాల రాయితీ అమ్మకాలు

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఈ ప్రపంచ సంగీత దినోత్సవం నాడు, అమెజాన్ డాట్ ఇన్ పై వినియోగదారు ఎలక్ట్రానిక్స్ లో అగ్ర డీల్స్ తో మీరు వినే అనుభవాన్ని పెంచుకోండి. ప్రసిద్ధి చెందిన బ్రాండ్స్ బోట్, జేబీఎల్, సోనీ మరియు ఇంకా ఎన్నో వాటి నుండి హెడ్ ఫోన్స్, స్పీకర్లు, సౌండ్ బార్స్ మరియు మ్యూజికల్ వాయిద్యాలు సహా విస్తృత శ్రేణి ఉత్పత్తుల పై కస్టమర్లు 75 శాతం వరకు ఉత్పత్తులను పొందవచ్చు. ఇంకా, కస్టమర్లు రూ.1,250 (నియమాలు మరియు షరతులు వర్తిస్తాయి) గరిష్ట ఆదాలతో ఎస్బిఐ క్రెడిట్ కార్డ్ ఈఎంఐ లావాదేవీల పై 10 శాతం వరకు తక్షణ డిస్కౌంట్ పొందవచ్చు. ఈ డీల్స్ నుండి అత్యధిక ప్రయోజనాలు పొందండి మరియు 21 జూన్ 2025 నుండి అమెజాన్ డాట్ ఇన్ ని సందర్శించండి. బోట్ సిగ్నేచర్ సౌండ్, సోనీ నాయిస్ కాన్సిలేషన్ వైర్ లెస్ బ్లూటూత్ ఓవర్ ఇయర్ హెడ్ ఫోన్, జేబీఎల్ న్యూ లాంచ్ ట్యూన్ బీమ్ 2 ఇయర్ ఇయర్ బడ్స్ నాయిస్ బడ్స్ ఈ సౌండ్ బార్ డీల్స్ తో పాటు బెస్ట్ ప్రముఖ కంపెనీలకు చెందిన సంగీత పరికరాలు అమెజాన్ డాట్ ఇన్ లో జూన్ 21వ తేదీ నుండి అందుబాటులో ఉన్నాయి.

అమెజాన్ ఫ్రెష్‌లో మిల్లెట్ స్టోర్

విశాలాంధ్ర-విశాఖపట్నం : చిరు ధాన్యాలను తీసుకువెళ్లేందుకు ఉపయోగం అయ్యేలా అమెజాన్ ఫ్రెష్ వారి ప్రత్యేకమైన మిల్లెట్ స్టోర్ ఫ్రంట్ లో అన్ని రకాల మిల్లెట్స్ ను అందుబాటులోకి తీసుకు వచ్చినట్టు ఆ సంస్థ ప్రతినిధి చెప్పారు. గ్లూటెన్ రహితమైన, మైదా లేని ఆప్షన్స్, అధిక ప్రోటీన్ గల బనానా పాన్ కేక్ మిక్స్, వేగంగా తయారయ్యే నూడిల్ లంచ్ ని సిద్ధంచేయడానికి లేదా ఏది అయినా ప్రత్యామ్నాయాలుగా పాలిష్ చేయని ఫాక్స్ టెయిల్, బార్న్ యార్డ్ చిరు ధాన్యాలకు మారినా, స్టోర్ సులభంగా వండటే మిక్స్ లు, సహజమైన పిండి, ఫైబర్ సమృద్ధిగా గల ధాన్యాల విస్తృత శ్రేణిని స్లాటెడ్ డెలివరీతో మరియు గొప్ప విలువతో తక్షణమైన ఆహారం సులభంగా, అందుబాటులో ఉండేలా చేసే గొప్ప విలువతో నిస్సందేహం కాని దేనినైనా అమెజాన్ ఫ్రెష్ లోని మిల్లెట్ స్టోర్ అందిస్తోందన్నారు. టాటా సోల్ ఫుల్ మిల్లెట్ మ్యూజ్లి ఫ్రూట్ %ం% నట్, స్లర్ప్ ఫార్మ్ మేజిక్ మసాలా మిల్లెట్ నూడుల్స్, స్లర్ప్ ఫార్మ్ మిల్లెట్ దోస ఇన్ స్టెంట్ మిక్స్, మిల్లీ గ్రెయిన్స్ కాంబో, ఆర్గానిక్ తత్వ జొన్న పిండి సహా అనేక మిల్లెట్స్ తో నిండిన పదార్థాలు అమెజాన్ ఫ్రెష్ మిల్లెట్ స్టోర్ లో అందుబాటులో ఉన్నాయని చెప్పారు.

రాష్ట్ర మంత్రులతో యోగాలో పాల్గొన్న నగర మేయర్ పీలా శ్రీనివాసరావు

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : విశాఖ వేదికగా జూన్ 21 న నిర్వహిస్తున్న అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా గురువారం విశాఖ ఆర్కే బీచ్ విశ్వ ప్రియ ఫంక్షన్ హాల్ ఎదురుగా ఉన్న ప్రధాన యోగ వేదిక వద్ద యోగా కార్యక్రమాలలో రాష్ట్ర మంత్రులు ఆరోగ్యశాఖ మంత్రి సత్య కుమార్ యాదవ్, రహదారులు భవనాల శాఖమంత్రి బిసి జనార్దన్ రెడ్డి, బీసీ సంక్షేమ శాఖ మంత్రి సవిత, విశాఖ జిల్లా ఇన్చార్జి మంత్రి డోలా బాల వీరాంజనేయ స్వామి , ఆరోగ్యశాఖ స్పెషల్ సెక్రటరీ ఎం. తిరుమల కృష్ణ బాబు, ఎమ్. ఎ ఆండ్ యు డి ప్రిన్సిపల్ సెక్రటరీ ఎస్. సురేష్ కుమార్, ఆయుష్ సెక్రటరీ రాజేష్ కొటేచా, విశాఖ జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేన్‌ధీరప్రసాద్ లతో కలిసి నగర మేయర్ పీలా శ్రీనివాసరావు యోగ క్రియలలో పాల్గొని అందరికీ స్ఫూర్తినిచ్చారు. అనంతరం జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ తో కలిసి యోగా కార్యక్రమాలకు సంబంధించి బీచ్ పరిసర ప్రాంతాల్లో పారిశుద్ధ్య నిర్వహణ ను స్వయంగా పరిశీలించారు. ఈ సందర్భంగా నగర మేయర్ మాట్లాడుతూ విశాఖ వేదికగా అంతర్జాతీయ యోగా దినోత్సవం జూన్ 21న విశాఖలో నిర్వహిస్తున్నందున ఈ యోగా దినోత్సవ కార్యక్రమానికి దేశ ప్రధాని నరేంద్ర మోదీ, రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ తో పాటు కేంద్ర రాష్ట్ర మంత్రులు, అధికారులు తో పాటు దాదాపు 5 లక్షల మంది యోగ ఔత్సాహికులు, ప్రజలు పాల్గొంటున్నందున నగరంలో పారిశుద్ధ్య నిర్వహణ ఎటువంటి ఆటంకం కలుగకుండా అవసరమగు మౌలిక సదుపాయాలు మీ కల్పిస్తూ ఎప్పటికప్పుడు వ్యర్థాలను తొలగించేలా చర్యలు తీసుకోవాలని, పబ్లిక్, మొబైల్ టాయిలెట్లు, రోడ్లు నిత్యం పరిశుభ్రంగా ఉంచేలా పకడ్బందీగా చర్యలు చేపట్టాలని, జీవీఎంసీ ప్రధాన వైద్యాధికారి డాక్టర్ నరేష్ కుమార్ ను ఆదేశించారు. నగరంలో యోగా నిర్వహించే ప్రాంతాల్లో ప్రజలు సౌకర్యార్థం మరుగుదొడ్లను ఏర్పాటు చేయాలని ఆదేశించారు.

జూన్ 28న జోన్-4లో బహిరంగ వేలం నిర్వహణ

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : మహా విశాఖపట్నం నగర పాలక సంస్థ 4 జోన్ లో పలు వాణిజ్య సముదాయాల దుకాణాలకు, ఒక కళ్యాణ మండపం, ఒక మార్కెట్, మెయిన్ ఆఫీ కాంటీన్ నకు జూన్ 28వ తేదీ ఉ.గం.11.00 లకు బహిరంగ వేలంపాట నిర్వహించడం జరుగు తుందని 4వ జోన్ జోనల్ కమిషనర్ ఎమ్.మల్లయ్య నాయుడు గురువారం పత్రికా ప్రకటన ద్వారా తెలిపారు. జీవిఎంసి 4వ జోన్ (సూర్యభాగ్) పరిధిలో గల డైక్స్ ట్యాంక్ వాణిజ్య సముదాయం, జగదాంబ వాణిజ్య సముదాయం, పాత బస్ స్టాండ్ దుకాణములు, పద్మనగర్ వాణిజ్య సముదాయం, సూర్యభాగ్ వాణిజ్య సముదాయం, టి.ఎస్.ఆర్ వాణిజ్య సముదాయం, కనకచెట్టు వాణిజ్య సముదాయం, రెల్లివీధి వాణిజ్య సముదాయం, అంగడిదిబ్బ వాణిజ్య సముదాయం లలోని మిగిలిన దుకాణాలకు, జివిఎంసి మెయిన్ ఆఫీస్ కాంటీన్, అంబేద్కర్ కళ్యాణ మండపం, రెల్లివీధి రోడ్ సైడ్ ఫిష్ మార్కెట్టును 3 సంవత్సరములు కాల పరిమితికి గుత్తకు ఇచ్చేందుకు 28-06-2025 తేదీన ఉదయం 11 గంటలకు బహిరంగ వేలం పాట నిర్వహించబడునని జోనల్ కమిషనర్ తెలిపారు. సదరు వేలంపాటలో పాల్గొనదలచిన వారు దరఖాస్తు సొమ్ము తదితర పూర్తి వివరాలకు 4వ జోనల్ కార్యాలయం పని వేళలో 4వ జోనల్ కార్యాలయం లోని పర్యవేక్షకుని సంప్రదించగలరని జోనల్ కమిషనర్లు తెలిపారు.

అందరి సమన్వయంతోనే గిన్నిస్ రికార్డు సాధ్యం

జిల్లా ఇన్చార్జి మంత్రి
డోలా శ్రీబాల వీరాంజనేయస్వామి

విశాలాంధ్ర-విశాఖ కలెక్టరేట్ : ప్రతీ ఒక్కరూ తమకు అప్పగించిన బాధ్యతలను సక్రమంగా నిర్వర్తించాలని, ప్రపంచ యోగా దినోత్సవ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని జిల్లా ఇన్చార్జ్ మంత్రి డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి కోరారు. సమన్వయంతో పనిచేయడం ద్వారా గిన్నిస్ రికార్డును సాధిద్దామని పిలుపునిచ్చారు. ప్రతీఒక్కరూ అప్రమత్తంగా ఉండి తమ విధులను నిర్వర్తించాలని కోరారు. యోగాంధ్ర కార్యక్రమంలో కంపార్ట్మెంట్ ఇన్‌ఛార్జులు, తహసీల్దార్లు, డిప్యూటీ కలెక్టర్లు, ఐఏఎస్ అధికారులు నిర్వర్తించాల్సిన విధులు, బాధ్యతలపై స్థానిక ఉడా చిల్డ్రన్ థియేటర్లో గురువారం సాయంత్రం అవగాహనా సదస్సును నిర్వహించారు. యోగాంధ్ర రాష్ట్ర నోడల్ అధికారి, ప్రభుత్వ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి ఎంటీ కృష్ణ బాబు మాట్లాడుతూ, వివిధ స్థాయి అధికారులు, వేదికల ఇన్‌ఛార్జులు చేయాల్సిన విధులను, ఏర్పాట్లను వివరించారు. ప్రభుత్వం యోగాంధ్ర కార్యక్రమ నిర్వహణను ఎంతో ప్రతిష్టగా తీసుకుందని, హాజరయ్యే ఏ ఒక్కరికీ ఎటువంటి ఇబ్బంది రాకుండా ఏర్పాట్లను చేయడం జరిగిందని చెప్పారు. గిన్నిస్‌బుక్ రికార్డును తప్పనిసరిగా సాధిస్తామని ఆయన స్పష్టం చేశారు. ప్రతీ కంపార్ట్మెంట్‌కు ఒక ఇన్‌ఛార్జును నియమించామని, కంపార్ట్మెంట్‌లో సుమారు 600 నుంచి 1300 మంది వరకు ఉంటారని తెలిపారు. యోగా ప్రక్రియను పర్యవేక్షించేందుకు 2,600 సిసి కెమెరాలను ఏర్పాటు చేశామన్నారు. వంద మందికి ఒక మరుగుదొడ్డిని ఏర్పాటు చేస్తున్నామన్నారు. పారిశుధ్య సిబ్బందిని వినియోగించి మరుగుదొడ్ల పరిశుభ్రంగా ఉంచాలని ఆదేశించారు. ముందుజాగ్రత్త చర్యగా సముద్రంలో గత ఈతగాళ్లు కూడా సిద్ధంగా ఉంటారని సనిస్టిడను తెలియజేశారు. కార్యక్రమానికి హాజరయ్యేవారిని దింపిన కంపార్ట్మెంట్ దగ్గరే వారిని తీసుకువెళ్లేందుకు బస్సులు వస్తాయని, వారు అక్కడే వేచి ఉండాలని సూచించారు. జిసిసి ఎండి కల్పన, ఏపిఐఐసి ఎండి అభిషిక్త్ మాట్లాడుతూ, యోగా కార్యక్రమానికి హాజరయ్యే ప్రతీఒక్కరూ తమ హాజరు శాతాన్ని నమోదు చేసే విధానం, స్కానింగ్ పద్ధతులను వివరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు పి. నారాయణ, గుమ్మడి సంధ్యారాణి, వంగలపూడి అనిత, కందుల దుర్గేశ్, కొలుసు పార్థసారథి, సత్యకుమార్ యాదవ్, వైద్యారోగ్య శాఖ కమిషనర్ వీరపాండియన్, జాయింట్ కలెక్టర్ మయూర్ అశోక్, మూడు జిల్లాల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకులను సత్కరించిన విన్నకోట రాము

విశాలాంధ్ర-పెందుర్తి : అనకాపల్లి జిల్లా కాంగ్రెస్ పార్టీలో నూతనంగా నియమితులైన పలువురు నాయకులను ఆ పార్టీ జిల్లా అసంఘటిత కార్మికుల సంఘం చైర్మన్ విన్నకోట రాము ఘనంగా సత్కరించారు. పెందుర్తి ఉడా కాలనీలోని తన నివాసంలో గురువారం ఉదయం శాలువాలతో సత్కరించి శుభాకాంక్షలు తెలియజేశారు. నూతనంగా నియమితులైన మాదుగుల అసెంబ్లీ కోఆర్డినేటర్ పవాల కొండలరావు, జిల్లా ప్రధాన కార్యదర్శులు కొల్లి వెంకట సత్యనారాయణ (ఏడుకొండలు ఆర్. ఆర్ నాయుడు, జిల్లా ఓబీసీ చైర్మన్ బొంతు రమణ, పెందుర్తి మండల పార్టీ అధ్యక్షులు ముక్కు రామునాయుడు, పరవాడ మండల పార్టీ అధ్యక్షులు శ్రీనివాసరావు, సబ్బవరం మండల పార్టీ అధ్యక్షులు బైలపూడి రాంబాబును ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా రాము మాట్లాడుతూ అనకాపల్లి జిల్లాలో కాంగ్రెస్ పార్టీని బలోపేతం చేసేందుకు తన వంతు కృషి చేస్తానన్నారు. ఈనెల 21న రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షురాలు షర్మిల విశాఖ పర్యటనను నాయకులందరూ విజయవంతం చేయాలని కోరారు. ఈకార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు బోయిన భానుమూర్తి యాదవ్, జిల్లా యువజన కాంగ్రెస్ ఉపాధ్యక్షులు బి. బాలమురళి, ఓబీసీ సెల్ మాదుగుల నియోజకవర్గం చైర్మన్ డి.గౌరీనాయుడు, ఎం.వెంకట రావు కె.వెంకటప్రసాదరావు తదితరులు పాల్గొన్నారు.

ఉల్లాసంగా యోగా చిత్రాలేఖనం పోటీలు

విశాలాంధ్ర-ఆనందపురం : గురువారం జూన్ 21 యోగ దే సందర్భంగా విద్యార్థులకు యోగ వలన ఉపయోగాలు తెలిపేలా విద్యార్థులు కు చిత్ర లేఖనం పోటీలు నిర్వహించారు శ్రీ సరస్వతి విద్యా విహార, విజ్ఞాన విహార పాఠశాలలు నుంచి 100 మంది ఎంపిక చేసిన విద్యార్థుల మధ్య ఈ పోటీలు నిర్వహించారు. జీవితంలో ప్రతి ఒక్కరు యోగ, ధ్యానం చేయడం వలన ఆరోగ్యంగా, మెరుగైన సమాజం కలిగి ఉంటామని చూపిస్తూ గీసిన చిత్రాలు అందరిని ఆకట్టుకున్నాయి. చిన్నప్పటి నుంచి పాఠశాల స్థాయిలో అవగాహన కల్పించడం ద్వారా భవిష్యత్‌లో మరింత ఆరోగ్య కర సమాజం నిర్మాణం అవుతుందని.. ప్రభుత్వం సంకల్పాన్ని అందరూ విజయ వంతం చేయాలని పాఠశాల యాజమాన్యం కోరింది.. విజేతలకు యోగ దే నాడు బహుమతి ప్రధానము చేస్తామని పేర్కొన్నారు. అందరికి యోగ నిత్య జీవితంలో ఒక భాగం కావాలని పాఠశాల కోరింది.

ఐసిఎస్ఎస్ఆర్ సీనియర్ ఫెలోషిప్‌కు ఏయూ ఆచార్యులు సాంబశివరావు ఎంపిక

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్మెంట్ విభాగం విశ్రాంత ఆచార్యులు ఆచార్య ఎస్. సాంబశివరావు ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ సోషల్ సైన్స్ రీసెర్చ్ లో సీనియర్ ఫెలోషిప్‌కు ఎంపికయ్యారు. ఈ సందర్భంగా ఆయనను ఇండియన్ ఇన్స్టిట్యూట్ ఫర్ పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్ విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం సభ్యులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా విశాఖపట్నం ప్రాంతీయ కేంద్రం డైరెక్టర్ ఆచార్య ఆర్.సుదర్శన్ రావు మాట్లాడుతూ విశాఖపట్నంలో ఉద్యోగుల జీవన నాణ్యత పై ఉద్యోగుల సంక్షేమ పద్ధతుల ప్రభావం అనే అంశంపై పరిశోధన చేయడానికి గాను ఎంపిక కావడం జరిగింది. కామర్స్ మేనేజ్మెంట్ విభాగం నుంచి 2024-% 2026 సంవత్సరానికి గాను ఆచార్య సాంబశివరావు ఒక్కరే ఎంపిక కావడం విశేషం. ఐఐపిఏ కార్యదర్శి ఆచార్య పేటేటి ప్రేమానందం మాట్లాడుతూ ఇటువంటి ఫెలోషిప్ లకు ఏయూ ఆచార్యులు ఎంపిక కావడం విశ్వవిద్యాలయానికి జాతీయస్థాయిలో మంచి గుర్తింపును తీసుకువస్తుందని అన్నారు. సమాజ అభివృద్ధికి ఉపయుక్తంగా నిలిచే పరిశోధనలు జరపడానికి అవకాశం ఏర్పడుతుందని చెప్పారు. కార్యక్రమంలో ఐ ఐ పి ఏ సభ్యులు ఆచార్య షమీం, డాక్టర్ హరిబాబు, డాక్టర్ రత్నరాజు, డాక్టర్ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

యోగాతో పాటు సమతుల్య ఆహారంతోనే ఆరోగ్యం

విశాలాంధ్ర-విశాఖపట్నం : యోగా సాధన అపారమైన ఆరోగ్య ప్రయోజనాలను అందిస్తుండగా, సరైన ఫలితాల కోసం సమతుల్య ఆహారం తీసుకోవటం కూడా అంతే అవసరం అని నటి సాహా అలీఖాన్, రితికా సమద్దార్, ఆయుర్వేద నిపుణులు మధుమిత కృష్ణన్ అన్నారు. యోగా దినోత్సవం సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రతి సంవత్సరం జూన్ 21న జరుపుకునే అంతర్జాతీయ యోగా దినోత్సవం, శారీరక, మానసిక, ఆధ్యాత్మిక శ్రేయస్సును పెంపొందించడంలో యోగా యొక్క సమగ్ర ప్రయోజనాలను వేడుక జరుపుకుంటున్నారు. ఆరోగ్యకరమైన ఆహారంలో కార్బోహైడ్రేట్లు, ప్రోటీన్లు, విటమిన్లు, ఖనిజాలు వంటి వివిధ రకాల పోషకాలు ఉండాలి. బాదం అనుకూలమైన, పోషకమైన ఎంపికగా నిలుస్తుందన్నారు. మీరు దీర్ఘ ఆసనాలు చేస్తున్నట్లే, తగినంత ప్రోటీన్ తీసుకోవడం అవసరం. ఇది యోగాసనాల తర్వాత కండరాల కోలుకోవడానికి మద్దతు ఇస్తుంది. గింజలలో రాజు అయిన బాదంలో 15 ముఖ్యమైన పోషకాలు పున్నాయన్నారు. డాక్టర్ మార్క్ కెర్న్ ఇటీవల ప్రచురించిన అధ్యయనం ప్రకారం, క్రమం తప్పకుండా బాదం తినడం, వ్యాయామం తర్వాత వేగంగా కోలుకోవడానికి సహాయపడుతుందన్నారు. డాక్టర్ ఆలివర్ విటార్డ్ చేసిన మరో అధ్యయనం బాదంను వ్యాయామం చేయడానికి ముందు ప్రభావవంతమైన చిరుతిండిగా వెల్లడించింది, ఇది కండరాల నొప్పిని తగ్గించడానికి , కండరాల పనితీరును మెరుగుపరచడానికి సహాయపడుతుందన్నారు. బాదంను రోజువారీ ఆహారంలో చేర్చడం వల్ల ఎల్ డి ఎల్ (చెడు) కొలెస్ట్రాల్‌ను తగ్గించడం, రక్తంలో చక్కెర నియంత్రణకు మద్దతు ఇవ్వడం, ఆరోగ్యకరమైన చర్మాన్ని పొందడం, ప్రభావవంతమైన బరువు నిర్వహణలో సహాయపడటం వంటి వివిధ ఆరోగ్య ప్రయోజనాలను పొందవచ్చు అన్నారు.

బజాజ్ అలియంజ్ మీకోసం హెల్త్ ఇన్సూరెన్స్ పాలసీ విడుదల

విశాలాంధ్ర-విశాఖపట్నం : భారతదేశంలోని ప్రముఖ ప్రైవేట్ జనరల్ ఇన్సూరెన్స్ సంస్థలలో ఒకటైన బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ఆంధ్రప్రదేశ్ నివాసుల నిర్దిష్ట ఆరోగ్య సంరక్షణ అవసరాలను తీర్చడానికి శ్రద్ధతో రూపొందించబడిన 'మీ కోసం' అనే ఒక సరికొత్త హెల్త్ ఇన్సూరెన్స్ ప్రోడక్ట్‌ను ఆవిష్కరించినట్టు బజాజ్ అలియంజ్ జనరల్ ఇన్సూరెన్స్ ప్రతినిధి డాక్టర్ తపన్ సింఘేల్ తెలిపారు. 'మీ కోసం' అనేది కేవలం ఒక హెల్త్ ప్లాన్ మాత్రమే కాదని, ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రం ప్రత్యేక వైద్య అవసరాలను దృష్టిలో ఉంచుకుని రూపొందించబడిన కవరేజ్‌తో నాణ్యమైన ఆరోగ్య సంరక్షణను రాష్ట్ర ప్రజలకు అందుబాటులో తీసుకురావడానికి చూపే నిబద్ధత అన్నారు. ప్రాంతాల వారీగా ఆరోగ్య సంరక్షణ సవాళ్లు, ఖర్చులు మరియు అందుబాటులో ఉండే చికిత్స మారుతుంటాయి అని అర్థం చేసుకున్న బజాజ్ అలియంజ్, అందరికీ ఒకే రకమైన పరిష్కారం అందించడానికి బదులుగా వ్యక్తిగతీకరించిన కవరేజ్ అందించడానికి 'మీ కోసం' ను రూపొందించిందన్నారు. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్రంలోని ఆసుపత్రి మౌలిక సదుపాయాలు మరియు ధరలను దృష్టిలో ఉంచుకుని రాష్ట్రంలో నివసించే ప్రజలు తమకు అవసరమైన రక్షణను పొందే విధంగా ఈ ప్లాన్ ప్రత్యేకంగా వారి కోసం రూపొందించబడిందని చెప్పారు. తక్కువ ధరలో అందరికీ అందుబాటులో ఉండే విధంగా రూపొందించబడిన 'మీ కోసం' ఆంధ్ర ప్రదేశ్ ప్రజల కోసం ప్రత్యేకంగా కస్టమైజ్ చేయబడిన ప్రీమియంతో విస్తృతమైన కవరేజ్ అందిస్తుంది. పాలసీ వ్యక్తిగత మరియు ఫ్లోటర్ వేరియంట్లలో అందుబాటులో ఉందని, ఈ కారణంగా ఇది వ్యక్తులకు మరియు కుటుంబాలకు ఒక అనుకూలమైన పరిష్కారంగా నిలుస్తుందన్నారు. రూ.5 లక్షల నుండి రూ.20 లక్షల వరకు ఉండే ఫ్లెక్సిబుల్ ఇన్సూరెన్స్ మొత్తం ఎంపికలతో, యువ ప్రొఫెషనల్స్ నుండి వృద్ధుల వరకు ప్రతి ఒక్కరికీ వారి ప్రత్యేక హెల్త్‌కేర్ అవసరాలకు తగిన కవరేజ్ ఎంపికను 'మీ కోసం' అందిస్తుందని తెలిపారు.

విషరహిత ఆహారం, ఆహార భద్రతపై ట్రోపికల్ ఆగ్రో నూతన ప్రచార కార్యక్రమం

విశాలాంధ్ర-విశాఖపట్నం : ఇండియాలోని ప్రముఖ పంట రక్షణ మరియు మొక్కల పోషక పదార్థాల రంగాలలో ముందున్న ట్రోపికల్ ఆగ్రోసిస్టమ్ (ఇండియా) ప్రైవేట్ లిమిటెడ్, ఆహార భద్రత మరియు విషరహిత ఆహారం విషయంలో తన నిబద్ధతను నెహల్ కాల్ కా హై అనే తాజా ప్రచారంతో మరింత బలోపేతం చేస్తుంది. ఈ జాతీయ స్థాయి ప్రచారం, పర్యావరణానికి అనుకూలమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడమే లక్ష్యంగా నిర్వహించబడుతోంది. వ్యవసాయాన్ని ప్రోత్సహించడం ద్వారా దీర్ఘకాలిక ఆహార భద్రత సాధించడానికి రైతులను ప్రేరేపించడం మరియు వినియోగదారులను బాధ్యతాయుతమైన ఆహార ఎంపికల వైపు మలచడం లక్ష్యంగా ఉంది. "పృథ్వి ఈ రోజు గురించే కాదు, రేపటి గురించి" అనే కేంద్ర సందేశంతో, ఈ ప్రచారం మట్టి ఆరోగ్యం, పర్యావరణ సమతుల్యతను కాపాడటం, భవిష్యత్తు ఆహార వ్యవస్థలను భద్రపరచడం వంటి అంశాలపై దృష్టిపెడుతుంది. రైతులు మరియు వినియోగదారులను కలిసి బాధ్యత వహించాల్సిన అవసరాన్ని ఇది తెలియచేస్తోంది. ఎందుకంటే సుస్థిరత అన్నది ఆహార సరఫరా గొలుసు మీద ఆధారపడి ఉంటుంది. జెనీవా ఎన్విరాన్మెంట్ నెట్వర్క్ ప్రకారం, అసంఘటితమైన వ్యవసాయ విస్తరణ వలన మట్టి నిర్వీణత, రసాయనాల అధిక వినియోగం వల్ల నీటి కాలుష్యం, గ్రీన్‌హౌస్ వాయువుల కాలుష్యం వంటి తీవ్రమైన సమస్యలు తలెత్తుతున్నాయి 2030 నాటికి ప్రపంచ జనాభా పెరిగే నేపథ్యంలో అదనంగా రెండు బిలియన్ల ప్రజలకు ఆహారం సరఫరా చేయాల్సిన అవసరం ఉంటుందని ట్రోపికల్ ఆగ్రో బలోపేతం చేస్తుంది.

పల్లా సింహాచలంకి శ్రద్ధాంజలి

విశాలాంధ్ర మల్కాపురం : గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తండ్రి మాజీ ఎమ్మెల్యే పల్లా సింహాచలం ఇటీవల మృతి చెందిన సంగతి తెలిసిందే. బుధవారం పెద్దకర్మ పురస్కరించుకొని 61వ వార్డు టిడిపి నాయకులు మహిళ నాయకులు శ్రీనివాస్ రావుని పరామర్శించి సింహాచలం చిత్రపటానికి శ్రద్ధాంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో అవార్డు సీనియర్ నాయకులు పోలిరెడ్డి, మహిళా అధ్యక్షులు సర్వశ్రీ శ్రీలక్ష్మి, నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

మనిషి జీవితాన్ని నేర్పే సాధనం విద్య : టిడిపి రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు

విశాలాంధ్ర-పద్మనాభం : మనిషికి ఉన్నతమైన విలువలతో కూడిన జీవితాన్ని అందించే సాధనం విద్యేనని తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి గంటా నూకరాజు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న విద్యలకు సర్వేపల్లి రాధాకృష్ణ పేరుతో అందించే విద్యా కిట్లను భీమిలి జోన్ 3వ డివిజన్ లో ఉన్న ఫిషర్మెన్ కాలనీ ప్రాథమికోన్నత పాఠశాలలో గంటా నూకరాజు చేతులమీదుగా అందించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్య వ్యక్తి వికాసానికి, ఎదుగుదలకు ఉపయోగపడుతుందని అన్నారు. పేద విద్యార్థులకు మెరుగైన విద్యను అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఎన్నో విధాలుగా సహకరిస్తుందని అన్నారు. గత వైసిపి ప్రభుత్వం ఇంట్లో ఒక పిల్లాడికి మాత్రమే ఆర్థిక సహకారం అందించేవారని కానీ నేడు కూటమి ప్రభుత్వం ఇంట్లో ఎంతమంది పిల్లలు చదువుకుంటే అంతమందికి తల్లికి వందనం పథకం ద్వారా ఆర్థిక సహకారం అందించామని అన్నారు. అదేవిధంగా విద్యా కానుక కిట్లను నాణ్యతతో ముడిపడే విధంగా తయారు చేసి అందిస్తున్నామని అన్నారు. విద్యార్థులు పాఠశాలలో సన్న బియ్యంతో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందిస్తున్నామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలలో చదివే విద్యార్థులు ప్రభుత్వం ఇస్తున్న సహకారాన్ని ప్రతీ ఒక్కరూ సద్వి నియోగం చేసుకోవాలని తల్లిదండ్రులకు గంటా నూకరాజు విజ్ఞప్తి చేసారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు కనకల నాగరాజు, మారోజు సంజీవకుమార్, కొక్కిరి అప్పన్న, వాడమొదలు సత్యారావు, పైడిపల్లి నర్సింగరావు, వియ్యపు పోతురాజు, గండిబోయిన పోలిరాజు, కందుల సుందర్ రావు, వాసుపల్లి వంశీ, పేరుపల్లి రాజు, విద్యా కమిటీ చైర్మన్ మద్దిల శ్రీను, ఉపాధ్యాయులు రామకృష్ణ, సతీష్ మరియు తల్లిదండ్రులు పాల్గొన్నారు.

యోగాంధ్ర వేడుకకు ఆర్టీసీ బస్సులు ప్రారంభం

ప్రారంభించిన మంత్రులు...

విశాలాంధ్ర బ్యూరో-విశాఖపట్నం : ఏపీఎస్‌ఆర్టీసీ ద్వారా బస్ స్టేషన్, వాల్తేరు డిపో, మద్దిలపాలెం డిపోలో మంత్రి పర్యటించారు. రవాణా శాఖ మంత్రి మండపల్లి రాంప్రసాద్ రెడ్డి, మున్సిపల్ శాఖ మంత్రి పి నారాయణ, బీసీ వెల్ఫేర్ మంత్రి, జిల్లా ఇంచార్జ్ మంత్రి డోలా రామాంజనేయులు పర్యటించి ఏపీఎస్‌ఆర్టీసీలో సుమారు 3200 బస్సులను ఉత్తరాంధ్రలో యోగా ఆంధ్రకు ప్రారంభించారు అదేవిధంగా ద్వారకా బస్ స్టేషన్ కాంప్లెక్స్‌లో మంత్రి సీసీ కెమెరాలు ప్రారంభించి ప్రయాణికులకు మెరుగైన సౌకర్యం చేయుటకు ఏపీఎస్‌ఆర్టీసీ ఎప్పుడు ముందుంటుందని తెలియజేశారు. మద్దిలపాలెం, వాల్తేరు డిపోల్లో ఉత్తమ కార్మికులకు అవార్డులు ప్రకటించి వారికి అందజేయడం అయినది. ఈ కార్యక్రమానికి ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జోన్-1 కె ఎస్ బి రెడ్డి, రీజనల్ మేనేజర్, విశాఖపట్నం బి.అప్పలనాయుడు, డిపో మేనేజర్ సుధాకర్, శ్రీమతి అరుణ, ఏటీఎం పి.బి.ఎం కె.రాజు, సూపర్వైజర్లు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా భీమిలి వైసిపి ఇన్చార్జ్ చిన్న శ్రీను కుమార్తె సిరమ్మ జన్మదిన వేడుకలు



విశాలాంధ్ర-పద్మనాభం : పద్మనాభం మండలం పద్మనాభం వైఎస్ఆర్సిపి పార్టీ కార్యాలయంలో భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) కుమార్తె సిరి సహస్ర (సిరమ్మ) పుట్టినరోజు వేడుకలను పార్టీ కార్యాలయంలో ఎంతో ఘనంగా నిర్వహించారు. మండలంలోని వివిధ పంచాయతీల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు, చిన్న శ్రీను అభిమానులు అందరూ సిరమ్మ పుట్టినరోజు వేడుకల కేక్ కటింగ్ ను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ నా పుట్టినరోజు శుభాకాంక్షలు తెలియజేయడానికి వచ్చిన ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు. చిన్న శ్రీను బిడ్డగా వైఎస్సార్ సీపీ అధినేత మాజీ సీఎం జగన్మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా నిత్యం ప్రజా సేవలో ఉంటూ ప్రజల ఆశీర్వాదం పొందడమే నాకు ఎంతో ఆనందమని ఆమె తెలియజేశారు. ఈ కార్యక్రమంలో స్థానిక ఎంపీటీసీ కె రాంబాబు,జెడ్పీ వైస్ చైర్మన్ ఎస్ గిరిబాబు, వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు కె లక్ష్మణరావు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు తదితరులు పాల్గొన్నారు.